# గరికి మేసిన గాడిద

రచన :
శ్రీమతి పఠానేని శ్రీశైలభ్రమరాంబ

'తాతయ్య! నాకో కథ చెప్పవూ?' అంది పూర్ణ.

'తాతయ్యా! ఇవ్వాళ మంచి కథ చెప్పాలి' అంటూ బాబ్జీ వచ్చి కూర్చున్నాడు.

'తాతయ్యా! ఇవ్వాళ నువ్వు చెప్పే కథ నేనూ వింటా. రేపు మళ్ళీ నేను మద్రాసు వెళ్ళిపోతే శలవులవరకూ రాను,' అన్నాడు అవధాని.

'పోయి చదువుకోండర్రా! నే చెప్పే కథలు రోజూ వింటున్నారుగా' అన్నాడు తాతయ్య.

'అల్లాకాదు తాతయ్యా! ఇవ్వాళ నువ్వు చెప్పే కథ వినాలని చాలా కుతూహలంగా ఉంది' అన్నాడు రవి.

'ఇవ్వాళ నా మనస్సు బాగుండలేదు. నే నేమీ చెప్పలేను వెళ్ళిపొండి' అని గద్దించాడు తాతయ్య.

'ఏం మామయ్యా! ఒంట్లో బాగుండలేదా?' అంటూ కోడలుకూడా వచ్చి అడిగేసరికి ఏమీ మాట్లాడకుండా ఆలోచిస్తూ కూర్చున్నాడు తాతయ్య.

ఇంకో అరగంటసేపు అందరూ వేధించడంతో తాతయ్యకు కథ చెప్పటం తప్పిందికాదు.

'అయితే మీరంతా కూర్చుని జాగ్రత్తగా వినండి. మధ్యలో మాత్రం నన్ను ఎల్లాంటి అడ్డు ప్రశ్నలూ వెయ్యకుండా ఉండాలి.'

'అల్లాగే తాతయ్యా! శ్రద్ధగా వింటాం చెప్పు!' అన్నాడు రవి.

అందరూ వెన్నెట్లో నిశ్శబ్దంగా కూర్చున్నారు.

* * *

ఓ రోజు మధ్యాహ్నం మండుటెండలో మలమలా మాడిపోతోన్న ఆకలితో ఇరవై ఏళ్లవాడు యాచనకోసం వచ్చి 'బాబూ! ఆకలి!! రక్షించండి!!!' అనేసి గుమ్మంలో స్పృహ తప్పిపోయాడు.

వెంటనే ఆ యింటి యజమాని సుబ్బావధాన్లుగారు బయటకు వచ్చి వానిని లోపలికి తీసుకెళ్ళి సేద తీర్చి ఆదరించారు. బాగా తెలివి వచ్చాక ఆతడు ''అయ్యా! నేను తల్లి తండ్రులు దిక్కూ మొక్కూ లేని దౌర్భాగ్యుణ్ణి-మీ యింట్లో నేవుండి మీ సేవచేస్తూ బ్రతుకుతాను,' అని ప్రాధేయపడిన వెంకన్నను తమ యింట్లో వుండడానికి అంగీకరించారు సుబ్బావధాన్లు.

సుబ్బావధాన్లుగారికి వంద యకరాల భూమి, నాలుగిళ్ల భవంతి మండువాఇల్లు, బ్రహ్మాండమైన గొడ్లసావిడి, పరికాళ్ల ఎడ్లు, నాలుగు ఆవులు. రెండు గేదెలు, పాడి పంటలతో, సిరిసంపదలతో, నిత్యాన్న సత్రంలా వుండేది వారిల్లు. ఆయనకి నల్గురు అమ్మాయిలు, అన్నపూర్ణవంటి మహాసాధ్వి యిల్లాలుతో ఏ లోటూ లేకుండా సుఖంగా వున్న సంసారం సుబ్బావధాన్లు.

నిరతాన్న దాతయైన సుబ్బావధాన్లు, ఆయన భార్య అన్నపూర్ణమ్మ కూడా వెంకన్నని పుత్రవాత్సల్యంతో ఆదరించేవారు - దిక్కూ మొక్కూ లేని ధీనుడు కావడంచేత, పనకి చేదోడు వాదోడుగా వుంటాడని తన సర్వ వ్యవహారాలు వెంకన్నకి చెప్తూండేవాడు సుబ్బావధాన్లు. ఒక సంవత్సరం యింట్లో అందరితోనూ కలిసి మెలిసి వుంటూ అందరి ఆదరాభిమానములకు పాత్రుడై నమ్మకస్తుడనే బిరుదాన్ని పొందాడు వెంకన్న. కాని తనకి కూడుగుడ్డలనిచ్చి ఆదరించినవారి కుటుంబానికి కృతజ్ఞత చూపించవలసినవారికి వారి ఐశ్వర్యాన్ని చూచేసరికి కన్నెర్ర కల్గింది. ఆ అసూయ అంతటితో ఆగక తనూ వారితో సమానంగా వుండాలన్నంత స్వార్థం బయలు దేరింది. అందుకు అనుకూలంగా సుబ్బావధాన్లు కూడా వెంకన్నను ఓ పెద్ద కొడుకులా భావించి సర్వ బాధ్యతలు ఒప్పగించాడు.

బజారు వెచ్చము మొదలు ధాన్యం పురికట్టించే వరకూ అన్ని పన్లూ వెంకన్న చేతిమీదుగా జరుగుతున్నాయి. నామమాత్రంగా మాత్రం సుబ్బావధానులు పెత్తనానికి ఓసారి వచ్చి చూస్తూండేవాడు. ముప్పయి ఎకరముల కొబ్బరితోటకు ప్రతి సంవత్సరం లక్షకాయ వస్తూండేది. సుబ్బావధాన్లు దగ్గరవుండి కొబ్బరి తోట దింపు తీయించేవాడు ప్రతి నెలా—వెంకన్న పెత్తనదారి వచ్చాక రేపో; ఎల్లుండో తోటదింపుకి సుబ్బావధాన్లు వస్తాడనగా, ముందుగా సగం కాయలు దింపు తీయించి అక్కడివాళ్ళ సహాయంతో తక్షణం ఆ కాయలు తర్లించి

చేసేవాడు—మళ్ళీ యథా ప్రకారం సుబ్బావధాన్లుతో కల్సి దింపు తీసే సమయానికి ఎంతో బాధ్యత వహించివ వానివలె నటిస్తూ కాయలు తక్కువగా పడినందుకు తన విచారాన్ని వెలిబుచ్చుతూ ఆయన్ని ఓదారుస్తూండే వాడు. తన చాటున జరగే నాటకాన్ని, వాని బూటకపు మాటల్ని గుర్తించలేని సుబ్బావధాన్లు వెంకన్న మాటలు నిజమేనని, తనతోట నిస్సారమై పోతోందని బాధ పడ్తూండేవాడు.

సుబ్బావధాన్లుతో సమానంతో దగ్గరుండి ఆకుమళ్ళు పోయించి, దమ్ములు చేయించి, ఊడ్పులు ఊడ్పించి ఎంతో కష్టపడ్డాడు వెంకన్న. ఆతని కష్టాన్ని చూచి అన్నపూర్ణమ్మ సుబ్బావధాన్లు కూడా ఎంతో ఆనందించారు వాని కృతజ్ఞతాభిమానానికి కలుపులు, కోతలు, కుప్పనూర్పులు కూడా ఆయ్యాయి. ధాన్యమంతా కళ్లంలో వుంది. సుబ్బావధాన్లు, వెంకన్న, మరికొందరు కూలీలు కాపలా కూర్చున్నారు ఎప్పటిలాగే.

“బాబూ! మేమంతా ఇక్కడున్నాం కదా! నేనిక్కడ వుండగా ఆ బ్రహ్మదేవుడు కూడా ధాన్యం కుప్ప దగ్గరికి వెళ్లలేడు. ప్రొద్దున్నే మీరువచ్చి చూసుకోవచ్చు, ఈ రాత్రికి ఇంటిదగ్గర నిద్రపొండి” అని సలహా చెప్పాడు వెంకన్న.

“ఈ ఒక్క రాత్రే కదా మనం కాపలా కాయవల్సింది? రేపు ప్రొద్దున్నే ధాన్యలక్ష్మి మన యింటికే వస్తుంది. ఒక్కపూటకి ఏ మాత్రం కష్టం పోనిద్దూ?” అన్నాడు సుబ్బావధాన్లు.

కాని అక్కడున్న బలమైన నల్గురు రైతులూ నచ్చచెప్పడంతో సుబ్బావధానులు మెత్తబడ్డాడు స్వతహాగా సుఖజీవి కావడంచేత—ధాన్యపు రాశిమీద ముద్రలు బాగా పరిశీలించి చూసుకొని వెంకన్నకి ఒప్పిగించి వెళ్ళి ఇంటిదగ్గర హాయిగా నిద్రపోయాడు.

తెల్లవారేసరికి బళ్లు తోలించుకు ధాన్యపు కళ్లం దగ్గర కొచ్చాడు. తాను వెళ్లేటప్పుడు చూచిన ముద్రలు చెక్కు చెదరకుండా వుండేసరికి వెంకన్న సహాయ సంపత్తికి వేయివిధాలుగా మెచ్చుకొన్నాడు సుబ్బావధాన్లు. తీరా ధాన్యం బస్తాల్లోకి పడేసరికి ప్రతీయేటా అయ్యే పంటలో మూడోవంతు మాత్రమే వచ్చాయని లబోదిబోమని మొత్తుకున్నాడు. కాని ఎవరిని ఏమనగలడు? తనుమాత్రం ఎప్పటిలాగే స్వంత వ్యవసాయం చేసుకున్నాడే కాని చేమకి ఎల్లాంటి లోటుపాట్లు రానివ్వలేదు. ఒక్క రాత్రి మినహా తనెప్పుడూ కోతల దగ్గర నుంచీ వదలనే లేదు. తన నష్టానికి ఇప్పుడు ఎవరిని నిందించగలడు సుబ్బావధాన్లు మాత్రం ?—చేలల్లో సారం తగ్గిపోయిందని ఒకరు? చేనంతా ఎరువులు లేక చవిటి పర్రలా అయిపోయిందని మరొకరు; విత్తనాల్లో ఏదో దోషం వుందేమోనని ఇంకొకరు: ఇల్లాగే అందరూ తలొకమాటతోనూ తనకి సానుభూతి చూపించారు—పోనీ ఎవరైనా తస్కరించారేమోనన్న అనుమానం మెరుపులా వచ్చినా, తను వేసిన ముద్రలు చెక్కు చెదరకుండా వున్నందువల్ల, ఆ ముద్రబల్లలు తన పెట్టిలోనే భద్రంగా దాచబడ్డం చేత ఆవిధంగా అనుమానించడానికి కూడా మనస్కరించక అక్కడవారందరీ మాటలతోనూ తన మనస్సుని కూడా ఏకీభవింప జేసుకొని తృప్తిపడ్డాడు సుబ్బావధాన్లు—ముద్ర బల్లలు కూడా ముందుగానే జాగ్రత్త చేయించుకు వుంచుకొని మూడు వంతులు ధాన్యం దక్కించుకొన్న వెంకన్న మాత్రం సుబ్బావధాన్లు మనస్సులో బాధపడ్తూంటే తను భోరున ఏడ్చి సానుభూతిని సంపాదించుకొన్నాడు.

ఆ సంవత్సరంలో ఒకొక్కప్పుడు వెంకన్నమీద సుబ్బావధాన్లు ఆనుమానిస్తూనే వుండేవాడు. కాని ఆయని కొద్దిగా మనస్సులో సందేహానికి తావిచ్చేసరికే అన్నపూర్ణమ్మగారు వెంకన్న తరఫున వకాల్తా తీసుకొన్న లాయరులా వాదించేది. వెంకన్న మనస్సు ఎక్కడ నొచ్చుకుంటుందో అని కన్నబిడ్డలా ఆదరించేది. కాని ఆ దంపతుల పరిపూర్ణవాత్సల్యం వెంకన్నకి పాముకి పాలుపోసినట్లయింది చివరకి.

వయస్సు వచ్చిన వెంకన్నను వంటరిగా వదిలెయ్యడం మంచిది కాదని యోచించి సుబ్బావధాన్లు పెళ్ళి చేసుకోమని కొంత డబ్బిచ్చి శుభకార్యం పూర్తయేవరకూ బాధ్యత కూడా వహించారు. భార్య వచ్చాక వెంకన్న వేరుగా కాపురం వుంటాననడంతో సంవత్సరానికి సరిపోయే ధాన్యం ఇస్తూ రోజుకు రూపాయి ఇస్తూండే

వాడు. ఎల్లాంటి విబెట్టు ఎరమరిక లేకుండా వాళ్ళిద్దర్నీ ఆదరిస్తూండేవారు సుబ్బావధాన్లు దంపతులు.

వెంకన్న భార్య కాపురానికి వచ్చిన సంవత్సరం లోనే ఒక కొడుకు పుట్టాడు. కొడుకు పుట్టిన తర్వాత వెంకన్న ఆశ హద్దుమీరి పోయింది. ఆతడు అపహరిస్తున్నాడని సూచాయగా తెల్సినా వెనక ఆసరాలేని వ్యవసాయకుడు కావడంచేత నమ్మకం తప్పలేదు. సుబ్బావధాన్లుకి.

పది సంవత్సరాలు గడిచిపోయాయి-ఈ దశలోనూ సుబ్బావధాన్లు కుటుంబంలో ఎన్నో మార్పులు వచ్చాయి. నల్గురు అమ్మాయిలకి పెళ్ళిళ్ళు చేసి అత్తవారిళ్ళకి పంపించాడు! కొడుకులిద్దరూ చదువులకోసం పట్టణం వెళ్ళిపోయారు.

ఇంతటి అవకాశం దొరికినప్పుడు వృధాగా పోనిస్తాడా వెంకన్న? దైవంకూడా మంచివాళ్ళనే పరీక్షిస్తూ వుంటాడన్న సామెత అక్షరాలా సుబ్బావధాన్లుకే సరిపోయింది. సుబ్బావధాన్లు పక్షవాతంతో మంచమెక్కాడు. ఏకైవచ్చి మేకై కూర్చున్న వెంకన్న పొలంమీది ఆదాయమంతా సగంతాను, సగం సుబ్బావధాన్లుకి ఇస్తూ; తనకివ్వవలసినదంతన్యాయంగా తీసుకొంటూన్నట్లు వారి దగ్గర వసూలు చేసుకొనేవాడు.

ఎన్ని కష్టాలు వచ్చినా, నష్టం కల్గినా తన కొడుకులు పట్ట పరీక్షలు ప్యాసై గౌరవంగా బ్రతకాలని, కాని తన వలె వ్యవసాయం చేసుకుంటూ వుండడం సుతరామూ ఇష్టంలేదు సుబ్బావధాన్లుకి. అల్లుళ్ళతోనైనా తన అవస్థను గురించి చెప్పుకొందామంటే; వీరింట్లో గాది క్రింద పందికొక్కులా చేరిన వెంకన్న వీరికి చేస్తూన్న అన్యాయాన్ని గురించి ఎన్నోసార్లు చెప్పారు అల్లుళ్ళు-వీరందర్నీ కాదని వెంకన్నని వుంచుకోవడంతో తనవాళ్ళందరికీ విరోధిగా అయ్యాడు ఆయన. ఇంతకీ మూలం 'అతివినయం ధూర్త లక్షణం' అని వెంకన్న తియ్యని మాటలు నమ్మకుండా వుండలేకపోయేవాడు సుబ్బావధాన్లు.

పట్నంలో వున్న సుబ్బావధాన్లు పెద్దకొడుకు ఒంట్లో జబ్బుగా వుందని, కొంత సొమ్ము పంపించమని ఇంటికి తంతి ఇవ్వగానే వెంకన్నను పంపించారు డబ్బుతో - నాల్గు రోజులు ఎవరికీ కన్పించకుండా తలదాచుకొని, రైల్లో తన దగ్గర సొమ్మంతా దొంగలు అపహరించారని వచ్చి చెప్పాడు వెంకన్న. ధర్మరాజు వంటి సుబ్బావధాన్లు నిజమేనని నమ్మాడు.

నెలరోజులయ్యేసరికి సుబ్బావధాన్లుగారి కొడుకులిద్దరూ చదువులు పూర్తయి ఇంటికి వచ్చారు-వెంకన్నయొక్క నేరాలను అన్నీ పరీక్షించి చూచి సుబ్బావధాన్లుకి చెప్పారు. క్షమించరాని అపచారాలు చేసినా వెంకన్నను ఏవిధంగానూ శిక్షించక తనపనిలోనుంచి మాత్రం తొలగి పొమ్మన్నాడు సుబ్బావధాన్లు.

చేతినిండా పుష్కళంగా వుందనే అహంభావంతోనూ, తన కొడుకుని కూడా సుబ్బావధాన్లు కొడుకువలె చదివించాలన్న ఆసక్తి చేతను, పదిహేనేళ్ళనుంచి పొలంలో పనులతో విసిగిపోయి ఇంక సుఖజీవనం చెయ్యాలనే అభిలాషవల్లనూ, ఆ పల్లెటూరును వదలి భార్యతోనూ కొడుకుతోనూ రాజమహేంద్రవరం కాపురం వచ్చేశాడు. వెంకన్న-రాజమండ్రిలో పెద్ద మేడకొని అందులో కాపురం పెట్టాడు-ఐశ్వర్యంతో తులతూగే వెంకన్న వెంకటేశ్వర్లుగా మారిపోయాడు రాజమండ్రిలో.

కాలక్షేపం కోసం సరదాగా షైర్లు తిరుగుతూండేవాడు వెంకన్న. కాని కొద్దిరోజుల్లోనే తనలాంటి సోమరిపోతులు పదిమంది తనకి మిత్రులుగా లభించారు. వృధాగా మారని రూపాయిలా ఊరంతా తిరుగుతూండడం బాగుండదని పేకాట ప్రారంభించారు. పేకాటకి ప్రాణసఖియైన త్రాగుడుకికూడా స్వాగత మిచ్చారు. చేతినిండా పుష్కలంగా డబ్బున్న వెంకన్నని మిత్రులు అంతటితో వదలక చల్లగా వేశ్యావాటికలో ప్రవేశపెట్టారు. ఒక్కసంవత్సరంలో తనదగ్గరున్న యావత్తు ధనాన్ని పోగొట్టుకొని ఒళ్ళు తెలియని ఆవేశంతో ఇంటికిచేరి భార్యను బాధిస్తూండేవాడు. వెంకన్న పెట్టే బాధలు భరించలేక, వానిభార్య కొడుకుతో సహా సుబ్బావధాన్లు ఇంటికివచ్చి తనభర్తని ఎల్లాగయినా మందలించి మంచిమార్గంలో పెట్టమని ప్రాధేయపడింది.

గతాన్ని స్మరించకుండా సుబ్బావధాన్లు కొడుకు కూడా బయల్దేరివచ్చి వెంకన్నకి ఎన్నోవిధాలా హితోపదేశం చేసారు. పక్షవాతంవచ్చి తగ్గిన సుబ్బావధాన్లు

కంటే కూడా వెంకన్నే అనారోగ్యంవల్ల దుర్బలుడై పోయాడు. ఆరోగ్యాన్ని పోగొట్టుకొన్న వెంకన్నను చూచి ఎంతో విచారపడ్డాడు సుబ్బావధాన్లు. చేతులు కాలాక ఆకులు పట్టుకొన్నట్లయింది వెంకన్నస్థితి. అయినా ఇకముందునుంచైనా మంచిగా ప్రవర్తిస్తే బాగు పడొచ్చునని సూచించిన ఆ తండ్రికొడుకుల మాటలను విని పశ్చాత్తాపానికి వచ్చాడు వెంకన్న. వెంకన్నను డాక్టరుకి చూపించాడు సుబ్బావధాన్లు. పరిస్థితి చాలా విషమించిందనియు, అయినా కాయశక్తులా ప్రయత్నిస్తా నని డాక్టరు అభయమిచ్చాక సుబ్బావధానులు కొడుకు వారింటికి వచ్చేశారు.

* * *

నెలరోజులు ఇంటిదగ్గరేవుండి మందు పుచ్చుకుంటు న్నాడు వెంకన్న - భార్య కొడుకు సేవ చెయ్యడంతో కొంచెం స్వస్థత కల్గుతూండేది. ధనమంతా పోయినా ఆ ఒక్క మేడ అయినా మిగిలినందుకే గ్రుడ్డిలో మెల్లలా సంతృప్తి పడేవాడు వెంకన్న. రోజూ రాత్రిళ్ళు మేడ పైభాగంలో వెంకన్న, క్రిందిభాగంలో భార్య కొడుకు పడుకొంటుండేవారు.

ఒకరోజు అర్ధరాత్రిసమయంలో అందరూ గాఢ నిద్రలో వుండగా గంగాభవాని పొంగింది, మేడలోని వారు ఎటూ కదలలేని పరిస్థితి వచ్చింది. క్షణాలమీద నీళ్ళు చుట్టూరా వచ్చేశాయి. మేడపైన ఉన్న భర్త ఏమైపోయాడో యని కొడుకుని వదిలేసి భర్తకోసం మేడ ఎక్కింది వెంకన్నభార్య-తల్లి ఏమైపోయిందో అని ఖంగారు పడ్తూ కొడుకూ తల్లి వెనకాల వచ్చాడు. ధన్ మని ఓ ప్రక్కని కొంతభాగం కూలింది మేడ. సరిగ్గా ఆ కూలిన భాగంలోనే వెంకన్నభార్య కొడుకు కూడా వుండిపోయారు - మేడ కూలినా; తన సర్వం పోయినా సరే; తన భార్యాబిడ్డలనిమాత్రం దక్కించు కోవాలని పిచ్చివానిలా మెట్లవైపుకు పరుగెత్తాడు వెంకన్న. కాని ఆ భాగమే కూలడంచేత క్రింద సావిట్లో యున్నవారికేమీ అపాయం లేదని ఎల్లాగైనా వాళ్ళని రక్షించుకోవాలని గభీలున మేడనుంచి క్రిందకి ఉరికే శాడు. లోపల తలుపులు వేసివున్నాయి. చుట్టుప్రక్కల వాళ్ళని పిల్చి తల్పులు బ్రద్దలు చేయించి లోపలికి వెళ్ళి చూచాడు. భార్య కొడుకు కన్పించక పోవడంతో ఖంగారు పడి అంతటా చూచి మేడమీదకు తనకోసం వచ్చారేమోనని చూడ్డానికివెళ్ళిన వెంకన్నకి రాళ్ళ క్రిందవున్న కొడుకు కాళ్ళు మాత్రం కన్పించాయి. "అబ్బాయీ!" అంటూ వెళ్ళి పైనుంచిపడిన రాళ్ళను తియ్యబోయాడు. కూలగా మిగిలినభాగం ధన్ మని వెంకన్న కాళ్ళమీద పడిపోయింది. బయట తల్పుల దగ్గరవున్నవాళ్ళు ఎల్లాగో అతిప్రయాసమీద ప్రాణంతో వున్న వెంకయ్యని బయటకు లాక్కొచ్చి కాపాడేరు. దడదడా కూలిపోయే మేడలని వదిలేసి అందరూ వచ్చే స్తోంటే దూరంగా కూర్చొని భార్యా బిడ్డలకోసం ఏడ్వడం తప్పించి వెంకన్న చెయ్యగలిగిందేముంది? లేచి నిలబడాలంటే కాళ్ళు రెండూ తొడలవరకూ వుండే ఎముకలు ముక్కముక్కలుగా నలిగిపోయాయి.

గోదావరీ వరదలు తగ్గి కొంచెం నీరు ఆరేసరికి నెల రోజులైంది. ఒక్కొక్కరే కూలిన కొంపలు కూలీలచేత బాగుచేయించుకొంటున్నారు. వెంకన్నకూడా తనభార్య కొడుకు కళేబరాలనైనా బయటకు తీయించాలను కొన్నాడు—ముందుగా ఆస్పత్రికివెళ్ళి కాళ్లు చూపించు కొన్నాడు. రెండుకాళ్లు తొడలవరకూ తీశేశారు. ఎటూ కదలలేనివాడయ్యాడు.

చల్లగా ఇంకొక నెలరోజులు గడిచిపోయాయి. ఈ రెండు నెలల్లోనూ వెంకన్నకి మానశికంగా, శారీరకంగా ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. తన వేశ్యాసంపర్క దోషంవల్ల తనలో పుట్టిన జబ్బుల ఫలితంగా రెండుకళ్లూ పోయాయి.

అన్నిపోయినా ఆశ అనేది మానవసహజమేకదా! తనకు కాళ్లు లేకపోయినా కళ్లు వస్తాయేమోనని ఆశించి తన మేడనుకూడా విక్రయించి కంటికి వైద్యంచేయించు కొన్నాడు—కాని...ఆరోగ్యం మాత్రం బాగుపడిందే కాని కళ్లు కన్పించవు. ఇంక ఆకళ్లు బాగుపడవనికూడా చెప్పేశారు డాక్టర్లు.'

అంతవరకూ చెప్పి ఆగిపోయాడు తాతయ్య.

'అయితే తాతయ్యా! ఆ సుబ్బావధాన్లు కొడుకులు వారంతామరి ఆ వెంకన్నను మళ్లీ తీసుకువెళ్లలేదా?' అనడిగాడు రవి.

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

వెంకన్న భార్య కొడుకు వరదలు రానిక్రితమే ఎక్కడికో వెళ్లిపోయి సురక్షితంగా వున్నారనుకొన్నారు సుబ్బావధానులు. కాని ఎన్నాళ్లయినా వాళ్ల వార్త తెలియకపోవడంతో; అన్నపూర్ణమ్మ అనేక విధాల పోరుపెట్టి వెంకన్నను చూచిరమ్మని తన కొడుకుని పంపించమంది భర్తతో. కాని వ్యవసాయంలో పనులు చాలా రద్దీగా వుండడంచేత కొడుకులిద్దరికీకూడా తొందరగా వెళ్లేందుకు అవకాశం చిక్కలేదు—తీరా వీళ్లు వెళ్ళి వాళ్లని గురించి వాకబుచేసేసరికి వెంకన్న కంటి గ్రుడ్డివాడై మేడను అమ్మేసినట్లు తెల్సింది. వెంకన్న మాత్రం ఎక్కడున్నాడో తెలియలేదు.

కాలప్రవాహంలో మళ్లీ ఒక పూర్ణ పుష్కరం గిర్రున తిరిగిపోయింది. సుబ్బావధానులుగారి కుటుంబం ఇద్దరు కొడుకులు, కోడళ్లు మనుమలుతో నిత్యసంతోషంతో కలకల్లాడ్తూవుంది. సిరిసంపదలతో తులతూగుతూవుంది. సుబ్బావధానులు, అన్నపూర్ణమ్మకూడా వెంకన్నని పూర్తిగా మర్చిపోయారు.

సరిగ్గా ఒకరోజున సుబ్బావధాన్లు వీధి అరుగుమీద కూర్చొని వుండగా ఒక డాక్టరు చిన్న కారుమీదవచ్చి "సుబ్బావధానులుగారూ! మీకోసం ఒక వ్యక్తి అహోరాత్రాదులు మిమ్మల్ని చూడాలని, మీ నామాన్ని ప్రతీక్షణం జపిస్తున్నాడు. ఆతడు లేచింది మొదలు "బాబూ! ఒక్కసారి సుబ్బావధాన్లు గారి గుమ్మం ముందుకు నన్ను తీసుకెళ్ళి పడెయ్యండి. నా పాపిష్టికథ చెప్పి వారిచేత క్షమార్పణ పొంది ప్రాణం వదిలేస్తాను" అని కాకిగోల చేస్తాడు. మీ యింటికి వచ్చే స్థితిలో లేదు. తమరేఒక్కసారి వచ్చి దూరంగా నిల్చుని మీ స్వరం విన్పించండి. వాడిగోల వినలేక పోతున్నాం!" అని చెప్పాడు ఆ డాక్టరు.

సహజ దయాశాలియైన సుబ్బావధాన్లు కారుమీద ఆ డాక్టరుతో కల్సి వెళ్ళాడు. దూరంగా కారుచి అఫ్ఫీను డాక్టరు అవధాన్లు దిగి అక్కడనుంచి ఆస్పత్రిలోకి వార్త పంపించారు తాము వచ్చినట్లుగా—

అరగంటలో ఒక తోపుడు కుర్చిలో ఓ మాంసపు ముద్దని, కుళ్ళిపోయి కంపుకొడ్తూ, జీవంతో వున్న ఓ మొండాన్ని ఈడ్చుకువచ్చారు. ఆ మొండానికి ఒకచేతికి వ్రేళ్ళు లేవు. రెండో చెయ్యి మోచేతివరకూ మొండేమే అది చూడలేక కళ్లు మూసుకొన్నాడు సుబ్బావధాన్లు.

"అదుగో, నువ్వు రోజూ తల్చుకు ఏడుస్తూన్న సుబ్బావధాన్లుగారు!" అన్నాడు డాక్టరు.

ఆ కుష్ఠరోగి వెంకన్నని ఇంక కళ్ళతో చూల్లేక తలవంచేసుకు అంతా కర్మఫలం అని కన్నీటి చుక్కలు విడిచాడు సుబ్బావధాన్లు"—

"కాదు తాతయ్యా! అడ్డదారని వెళ్లేవాళ్ళ బ్రతుకులు అంత్యదశలో ఇల్లాగే వుంటుందని ఓ నీతిపాఠం బోధించాడు లోకానికి. అందుకే వెంకన్న పేను చెప్పేసరికి నాన్న అంత అసహ్యించుకొంటాడు" అన్నాడు సుబ్బావధాన్లు మనుమడు అవధాని.

అంతలో అన్నపూర్ణమ్మగారు వచ్చి "పోన్లెద్దురూ! వాడి పాపం వాడే అనుభవిస్తున్నాడు" అంది.

గరికిమేసిన గాడిద, కథ సమాప్తం.

